# పోతనభాగవతంలో రసగుళికలు
## – ఆర్.శర్మ దంతుర్తి



## 55 వ భాగం

### దక్ష ప్రజాపతి – 4

### సతీదేవి కోరిక

ఒకరినొకరు శపించుకుని దక్షుడు చేసే యాగంలోంచి దక్షుడూ, శివగణాలూ బయటకి వెళ్ళిపోయారని క్రితం వ్యాసంలో చదువుకున్నాం కదా? ఇంత జరిగాక వీరందరూ మరో యజ్ఞం మొదలుపెట్టారు – మనఃశ్శాంతి కోసమో మరోదాని కోసమో. దానిని గురించి శుకమహర్షి పరీక్షిత్తుకి చెప్తున్నాడు.

సీ. అనఘాత్మ! యే యజ్ఞమందు సర్వశ్రేష్ఠుఁ;
దగు హరి సంపూజ్యుఁడై వెలుంగు
నట్టి యజ్ఞంబు సమ్యగ్విధానమున స;
హస్ర వత్సరములు నజుఁ డొనర్చెఁ
గరమొప్ప నమర గంగాయమునా సంగ;
మావనిఁ గలుగు ప్రయాగ యందు
నవభృథస్నానంబు లతిభక్తిఁ గావించి;
గతకల్మషాత్ములై ఘనత కెక్కి [4-53]

తే. తగ నిజాశ్రమభూములఁ దలఁచి వార
లందఱును వేడ్కతోఁ జని రనుచు" విదురు
నకును మైత్రేయుఁ డను మునినాయకుండు
నెఱుఁగ వినిపించి వెండియు నిట్టు లనియె. [4-53.1]

సర్వ శ్రేష్టుడైన శ్రీహరికి సరిపోయే మరో యజ్ఞాన్ని వేయి సంవత్సరాలు చేసి గంగా యమునలు కలిసేచోట ప్రయాగలో స్నానాలు చేసి పాత కల్మషాలు పోగొట్టుకుని వెనక్కి వెళ్ళారు. ఇలా గంగలో స్నానం చేసి పాపాలు పోగొట్టుకోవడం అనేది ఎలా మొదలైందో ముందు గంగావతరణం వ్యాసాల్లో చూసాం కదా? మిగిలిన కథ ఇంకా చెప్తున్నాడిప్పుడు శుక మహర్షి.

వ.అంత శ్వశురుండగు దక్షునకు జామాత యైన భర్గునకు నన్యోన్య విరోధంబు పెరుఁగుచుండ నతిచిరంబగు కాలం బరిగె; నంత దక్షుండు రుద్రవిహీనంబగు యాగంబు లేనిది యైనను శర్వుతోడి పూర్వ విరోధంబునను బరమేష్ఠి కృతంబైన సకల ప్రజాపతి విభుత్వగర్వంబు ననుం జేసి బ్రహ్మనిష్ఠులగు నీశ్వరాదుల ధిక్కరించి యరుద్రకంబుగా వాజపేయ సవనంబు గావించి తదనంతరంబ బృహస్పతిసవన నామకం బైన మఖంబు చేయ నుపక్రమించిన నచ్చటికిం గ్రమంబున. [4-54]

మామ దక్షుడికీ, అల్లుడైన ఈశ్వరుడికీ మొదట్లో మొదలైన విరోధం అలా పెరుగుతూనే ఉంది. బ్రహ్మ దక్షుణ్ణి ప్రజాపతులందరికీ అధ్యక్షుణ్ణి చేసేసరికి గర్వం వల్ల, ఈ శత్రుత్వం చూపించడానికో మరొకటో గానీ, దక్షుడు ఈశ్వరుడు లేని (రుద్రవిహీనంబగు) యాగం అనేది లేనేలేదని తెలిసి కూడా మరో వాజపేయం అనే యజ్ఞం చేసాడు. ఎలా చేసాడు? తనని అధ్యక్షుడిగా చేసిన బ్రహ్మనీ ఈశ్వరుణ్ణీ ధిక్కరిస్తూను. పోనీ అక్కడ ఊరుకున్నాడా? మరో బృహస్పతి అనే యజ్ఞం చేయడానికి పూనుకున్నాడు ఇదే విధంగా.

చ. కర మనురక్తి నమ్మఖముఁ గన్గొను వేడుక తొంగలింపఁగాఁ
బరమమునిప్రజాపతి సుపర్వ మహర్షి వరుల్ సభార్యులై
పరువడి వచ్చి యందఱు శుభస్థితి దీవన లిచ్చి దక్షుచేఁ
బొరిఁబొరి నచ్చటన్ విహిత పూజల నొందిరి సమ్మదంబునన్ [4-55]

అలా మొదలుపెట్టిన యజ్ఞానికి మునులు, ప్రజాపతులు, దేవతలు (సుపర్వులు), మహర్షులు అందరూ బయల్దేరారు. వీళ్ళదేవుంది? పిలిస్తే వచ్చేవారు కదా? కానీ ఎవరి ప్రమేయం లేకుండా యజ్ఞం పూర్తి అవదో వాళ్లని మాత్రం పిలవలేదు, కోపం ఉంది కదా ఇంకా? అంటే భగవంతుణ్ణి తప్ప అందర్నీ పిలిచాడు.

తే. దక్షతనయ సతీదేవి దవిలి యాత్మ
సదనమున నుండి జనకుని సవనమహిమ
గగన చరులు నుతింప నా కలకలంబు
విని కుతూహలిని యయి వీన్వీథిఁ జూడ. [4-56]

ఇలా సదస్యులందరూ గగనమార్గంలో వెళ్తూంటే సతీదేవి ఆ కలకలాన్ని చూసి ఆ యజ్ఞం మహిమ గురించి వాళ్ళు మాట్లాడుకోవడం విని కనుక్కుంది అదంతా ఏమిటో.

సీ. తనరారు నవరత్న తాటంక రోచులు;
చెక్కుటద్దములతోఁ జెలిమి చేయఁ;
మహనీయ తపనీయమయ పదకద్యుతు;
లంసభాగంబుల నావరింప;
నంచిత చీనిచీనాంబర ప్రభలతో;
మేఖలాకాంతులు మేలమాడఁ;
జంచల సారంగ చారు విలోచన;

ప్రభలు నల్దిక్కులఁ బ్రబ్బికొనఁగ; [4-58]

తే. మించు వేడుక భర్తృసమేత లగుచు
మానితంబుగ దివ్య విమానయాన
లగుచు నాకాశపథమున నరుగుచున్న
ఖచర గంధర్వ కిన్నరాంగనలఁ జూచి. [4-58-.1]

ఆ వెళ్ళేవాళ్ళలో నవరత్నాలు తాపిన చెవికమ్మల కాంతులు తళతళ్ళాడే చెక్కిళ్ళపై పడుతుండగా, మేలిమి బంగారు కాంతులు భుజాలపై వ్యాపిస్తూంటే, చీని చీనాంబరాల కాంతులు మెరుస్తుండగా, లేడి కన్నుల (సారంగ చారు విలోచన) వెలుగులు నాలుగు దిక్కులా ప్రసరిస్తుండగా ఉరకలు వేసే ఉత్సాహంతో తమ తమ భర్తలతో కూడి దివ్యవిమానాలను అధిరోహించి దేవతాస్త్రీలు (ఖచర గంధర్వ కిన్నరాంగనలు) ఆకాశంలో కనిపించారు. పేరంటాలకి పిలిస్తే వెళ్ళేవారిలా అన్నమాట. ఇది చూసి ఆశ్చర్యమైంది సతీదేవికి. అందరిలాగే తానూ పుట్టింటికి వెళ్ళి రావాలని ఉబలాటపడడం సహజం కదా?

క. సతి దన పతి యగు నా పశు
పతిఁ జూచి సముత్సుకతను భాషించె;"ప్రజా
పతి మీ మామ మఖము సు
వ్రతమతి నొనరించుచున్న వాఁడఁట వింటే; [4-59]

సతి ఇదంతా చూసి శివుడి దగ్గిరకెళ్ళి అంటోంది, “చూసారా, మీ మామగారు దక్షుడు బాగా మరో మంచి యజ్ఞం చేస్తున్నాడుట,” అని.

క. కావున నయ్యజ్ఞమునకు
నీ విబుధగణంబు లర్థి నేగెద; రదిగో!
దేవ! మన మిప్పు డచటికిఁ
బోవలె నను వేడ్క నాకుఁ బుట్టెడు నభవా! [4-60]

అలా అందరూ వెళ్తున్నారు చూడండి, నాకు కూడా వెళ్ళాలనే కోరిక పుడుతోంది. ఇక్కడ సతి “నేను ఒక్కత్తినే” అనటం లేదు సతీ దేవి. “మనమిప్పుడు” అంటే, మనందరం కూడా వెళ్దాం అనే అడుగుతోంది.

క. ఆ యజ్ఞముఁ గనుగొనఁగా
నా యనుజులు భక్తిఁ బ్రాణనాథుల తోడం
బాయక వత్తురు; మనముం
బోయిన నే వారి నచటఁ బొడగనఁ గల్గున్. [4-61]

ఇప్పుడు మనం కూడా వెళ్తే అక్కడకి నా అక్క చెల్లెళ్ళు అందరూ వాళ్ళవాళ్ళ భర్తలతో వస్తారు. అందర్నీ చూసినట్టు ఉంటుంది.

క. జనకుని మఖమున కర్థిం
జని నీతోఁ బారిబర్హ సంజ్ఞికతఁ గదుం
దనరిన భూషణములఁ గై
కొన వేడ్క జనించె నీశ! కుజనవినాశా! [4-62]

అలా వెళ్ళి తండ్రి చేసే యజ్ఞంలో వాళ్ళు ఇచ్చే పరిబర్హం అనే కానుకలని తీసుకోవాలని కోరిక జనించింది. ఇక్కడ శివుణ్ణి పోతన ఏమన్నాడో గమనించారా? ఈశ, కుజనవినాశా (దుష్టులని వినాశం చేసేవాడు). ఈ కుజనవినాశా అనేది చూస్తేనే రాబోయే ఉపద్రవం తెలుస్తుంది.

క. నాతోడను స్నేహము గల
మాతను దత్సోదరీ సమాజము ఋషి సం
ఘాతకృత మఖసమంచిత
కేతువుఁ గన వేడ్క గగనకేశ! జనించెన్. [4-63]

క్రితం సారి జరిగిన యజ్ఞంలో శివుణ్ణి శపించాడని, తనని వెళ్ళవద్దంటాడేమో అని ఇంకా చెప్తోంది సతీదేవి. మా అమ్మకీ, నాకూ స్నేహమే. అక్కచెల్లెళ్లనీ, ఋషి సంఘాలనీ చూసి అక్కడ మహాయజ్ఞంలో ఉంచే ధ్వజాన్ని (కేతువు) చూడాలని కుతూహలంగా ఉంది.

వ. అదియునుం గాక దేవా! మహాశ్చర్యకరంబై గుణత్రయాత్మకంబగు ప్రపంచంబు భవదీయ మాయా వినిర్మితం బగుటం జేసి నీకు నాశ్చర్యకరంబు గాదు; ఐనను భవదీయ తత్త్వం బెఱుంగఁ జాలక కామినీ స్వభావంబు గలిగి కృపణురాలనై మదీయ జన్మభూమిఁ గనుంగొన నిచ్చగించితి" నని వెండియు నిట్లనియె. [4-64]

అయితే ఇలాంటి చిన్నచిన్న యజ్ఞం అనే విషయాలు మనకెందుకు అంటాడేమో అని మరింత వివరంగా చెప్తోంది. ఈ విశ్వం సత్వరజస్తమో గుణాలతో త్రిగుణాత్మకం అయినా మీ మాయ వల్ల నిర్మించబడింది కనక మీకు ఆశ్చర్యం కలిగించదు. కానీ ఆ స్వభావం తెలుసుకోలేక స్త్రీని కనక పుట్టింటికి వెళ్ళాలని అనుకుంటున్నాను.

చ. "ముదమునఁ దన్మఖోద్భవ విభూతిఁ గనుంగొన నన్యకామినుల్
పదవులు గట్టి భూషణవిభాసితలై నిజనాథయుక్తలై
మదకలహంస పాండురసమంచిత దివ్య విమానయానలై
యదె చనుచున్నవారు గను మభ్రపథంబున నీలకంధరా! [4-65]

ఓ సారి పైకి చూడండి, ఈ దేవతా స్త్రీలందరూ మంచి బట్టలూ ఆభరణాలూ ధరించి దివ్యమైన విమానాల్లో ఆ యాగాన్ని చూడడానికి ఎలా వెళ్తున్నారో?

క. అనఘా! విను లోకంబుల
జనకుని గేహమునఁ గలుగు సకల సుఖంబుల్
తనయలు చని సంప్రీతిం
గనుఁగొన కే రీతి నిలుచుఁ గాయము లభవా! [4-66]

వినండి, లోకంలో తండ్రి ఇంట జరిగే శుభకార్యాలని చూడకుండా ఏ అమ్మాయి ఉండగలదు? అలా ఉంటే ప్రాణాలు నిలుస్తాయా?

క. అనయముఁ బిలువక యుండం
జన ననుచిత మంటివేని జనక గురు సుహృ
జ్జననాయక గేహములకుఁ
జనుచుందురు పిలువకున్న సజ్జను లభవా!" [4-67]

అయితే పిలవని పేరంటానికి వెళ్లకూడదంటావేమో, తండ్రి ఇంటికీ, గురువు దగ్గిరకీ, మంచి మిత్రుల దగ్గరికీ, రాజు (జననాయకుడు) దగ్గిరకీ సజ్జనులైన వారు పిలవకుండా వెళ్లవచ్చు కదా? ఇంత ఎందుకు చెప్తోందంటే, తనకి వెళ్ళాలని ఉంది, అటువైపు శివుడు తండ్రి మీద కోపం మనసులో ఉంచుకోలేదని నిర్ధారణ చేసుకోవడానికి.

వ. అని మఱియు నిట్లనియె "దేవా! నా యందుఁ బ్రసన్నుండవై మదీయ మనోరథంబుం దీర్ప నర్హుండవు; సమధిక జ్ఞానంబు గల నీచేత నేను భవదీయదేహంబు నందర్ధంబున ధరియింపంబడితి; నట్టి నన్ను ననుగ్రహింపవలయు" నని ప్రార్థించిన మందస్మితవదనారవిందుం డగుచు జగత్స్రష్టల సమక్షంబున దక్షుండు తన్నాడిన మర్మభేదంబు లైన కుహక వాక్యసాయకంబులం దలంచుచు నిట్లనియె.
[4-68]

ఇదంతా చెప్పి ఇప్పుడు అడుగుతోంది మరోసారి – నా కోరిక తీర్చడానికి అర్హుడివి. నీకున్న అధిక జ్ఞానం చేత (అంటే మా తండ్రి కన్నా నువ్వు జ్ఞానవంతుడివి కనక, ముందు జరినదాన్ని మనసులో పెట్టుకోక), నేను నీ దేహంలో అర్ధ భాగం అవడం చేతా (అంటే వివాహం తర్వాత) నా కోరిక తీర్చి అనుగ్రహించాలి.

ఇలా అనేసరికి శివుడు చిరునవ్వు నవ్వుతూ, క్రితం సారి యజ్ఞం సమయంలో ప్రజాపతుల సమక్షంలో (జగత్స్రష్టల = జగత్ – లోకముల, స్రష్టల – సృష్టి కారకులు) దక్షుడు తనని తూలనాడిన మాటలు (మర్మభేదంబులు – మనసుకు కష్టము కలిగించే, కుహక – కపట; సాయకంబులన్ – బాణములను) గుర్తు తెచ్చుకుని ఇలా అన్నాడు.

శివుడు వెళ్ళమంటాడో, వద్దో వచ్చే నెల వ్యాసంలో.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)